క్లుప్తంగా

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీవారు తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కోటాతో మధుర స్మృతులు మరువలేనివి

సహచరుడు రత్నారెడ్డి


రత్నారెడ్డితో కోట శ్రీనివాసరావు(ఫైల్)

అనపర్తి: విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి జీర్ణించుకోలేకపోతున్నానని అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బొల్లా రెడ్డి రత్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను కోట శ్రీనివాసరావు ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో 1963–66 వరకు డిగ్రీ చదువుకున్నామని చెప్పారు. ఎంతో సౌమ్యుడైన శ్రీనివాసరావు 15 రోజులకు ఒకసారైనా తనతో ఫోన్‌లో మాట్లాడేవారని, తాను 2003లో రిటైర్ అయినప్పుడు కూడా ఆయన వచ్చారని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కోటా శ్రీనివాసరావు వంటి స్నేహితుడు ఉండడం తనకు ఎంతో ఆనందదాయకమన్నారు. ఆయన మృతి వ్యక్తిగతంగా తనకు, సినీ ఇండస్ట్రీకి తీరనిలోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

రంగంపేట: అందరూ సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పాత వీరంపాలెం గ్రామంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ నాగులపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో సత్యసాయి సామూహిక వ్రత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రశాంతి పతాక ఆవిష్కరణ చేశారు. సత్యసాయి వ్రత సహస్రావధాని కాకినాడకు చెందిన యడవల్లి రఘుపతి మాస్టారు రెండు గంటల పాటు నిర్వహించిన సత్యసాయి సామూహిక వ్రతాలు భక్తుల్ని తన్మయుల్ని చేసింది.

పీహెచ్‌సీలో చర్మ ఆరోగ్య దినోత్సవం


ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

రాజానగరం: ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీలో ఆదివారం ఉచిత చర్మ వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాతీయ చర్మ వ్యాధుల అసోసియేషన్ (ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో, జీఎస్ఎల్ వైద్య కళాశాల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. చర్మ వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యులు డాక్టర్ సీతారాం, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సుభాషిణి అవగాహన కలిగించారు. వైద్య విద్యార్థులు సేవలందించారు.

జూదరుల అరెస్ట్

సీతానగరం: చీపురుపల్లి పంచాయతీలోని అచ్యుతాపురంలో మిడిల్ కాయిన్ ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో సిబ్బందితో దాడి చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

రాజమహేంద్రవరం సిటీ: పరిసరాల పరిశుభ్రతకు జాతీయ సేవా పథకం వలంటీర్లు నిరంతరం కృషి చేస్తారని ఆదిత్య ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వలంటీర్లు తొలగించారు. కార్యక్రమంలో సొసైటీ మెంబర్ డాక్టర్ మహాలక్ష్మి, జిల్లా కో–ఆర్డినేటర్ పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్?

- ఏడీబీ రోడ్డులో వంతెన హుళక్కేనా?
- జంక్షన్‌లో కల్వర్టుల స్థానే తూరలు
- కొత్త కాలనీకి ముంపు భయం


కల్వర్టు నిర్మించాల్సిన ఏడీబీ రోడ్డు జంక్షన్‌లో వేసిన తూరలు

రాజానగరం: ఏవో అద్భుతాలు చేసేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు.. తమకు అనుకూలంగా పనులు చక్కబెట్టుకుంటూ, ప్రజలను కష్టాల్లోకి నెట్టేస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలు అభివృద్ధి ప్రణాళికల్లోనూ కూటమి నేతలు గందరగోళం సృష్టిస్తూ.. 'లబ్ధి' పొందేందుకు లేనిపోని ప్రయత్నాలు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులు కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. 16వ నంబరు జాతీయ రహదారిపై స్థానిక జెడ్పీ హెచ్ స్కూల్ (కలవచర్ల జంక్షన్) నుంచి కాకినాడ వరకు 57 కిలోమీటర్ల మేర ఉన్న ఏడీబీ రోడ్డును మధురపూడి ఎయిర్ పోర్టు రోడ్డుకు అనుసంధానం చేయడంలో భాగంగా నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి పరుస్తూ దశాబ్ద కాలం క్రితం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు సహకారంతో పనులు చేపట్టారు. ఇందులో భాగంగా జెడ్పీ హెచ్ స్కూల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది. ఫ్లైఓవర్ నిర్మాణం జరగాల్సిన ప్రాంతంలో కొన్నేళ్లుగా అభివృద్ధి కూడా నిలిచిపోయింది. గ్రామంలో సాయిబాబా మందిరం వైపు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతుంటే, ఈ ప్రాంతంలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రస్తుతం ఉన్న వ్యాపార దుకాణాలన్నీ మరుగున పడిపోతాయని, వ్యాపార లావాదేవీలు పుంజుకునే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందని వ్యాపారులు అంటున్నారు. దీంతో ఇప్పటికే నిర్మించి ఉన్న దుకాణాల్లో అరకొరగా వ్యాపారాలు జరుగుతున్నా కానీ, కొత్తగా స్థలాలు కొని, దుకాణాలు ఏర్పాటు చేసేందుకు మాత్రం వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగా ఈ ప్రాంతంలో భూమి ధరలు కూడా మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే చాలా తక్కువగా పలుకుతున్నాయి.

పునః ప్రారంభం!

నిధుల లేమితో కొంతకాలంగా నిలిచిపోయిన ఏడీబీ రహదారి విస్తరణ పనులు ఇటీవల కాలంలో పునఃప్రారంభమయ్యాయి. అయితే రహదారి విస్తరణ వరకు పనులు జరుగుతున్నా కానీ, ముందుగా పేర్కొన్న విధంగా ఫ్లైఓవర్‌కి సంబంధించిన పనులు మాత్రం జరగడం లేదు. దీనిపై స్థానికంగా పలు రకాలుగా ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ పెద్దలతో రాజకీయంగాను, సామాజికంగాను సంబంధాలు కలిగిన ఓ వర్గం తమ వ్యాపార లావాదేవీలకు ఇబ్బంది కలగకుండా చక్రం తిప్పిందని, ఆ కారణంగానే ప్రస్తుతం ఫ్లైఓవర్ పనుల ప్రస్తావన లేకుండా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయంటున్నారు. ఇందులో వాస్తవం ఎంతనే విషయమై ప్రశ్నిస్తే.. సంబంధిత అధికారులు కూడా నోరు మెదపకపోవడం గమనార్హం.

తరచూ ముంపు సమస్య!

ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ జంక్షన్ వద్ద ముంపునీరు దిగువకు వెళ్లేందుకు వీలుగా కల్వర్టును నిర్మించాల్సి ఉంది. ఆ ప్రాంతంలో తూరలు వేసి మమ అనిపిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారిపై ఈ ప్రాంతంలో కల్వర్టును నిర్మించకపోవడం వల్ల భారీ వర్షాల సమయంలో గ్రామంలోని కొత్తకాలనీ, సుబ్బారావు కాలనీలు తరచూ ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఏడీబీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వేస్తున్న తూరల వల్ల ఈ సమస్యకు పరిష్కారం లభించకపోగా, మరింత తీవ్రమయ్యేందుకు అవకాశం లేకపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జంక్షన్‌లో జాతీయ రహదారి దిగువన ప్రస్తుతం ఉన్న సింగిల్ తూరకు ఏడీబీ రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న సీసీ డ్రైన్లను అనుసంధానం చేయడం వల్ల ముంపు తీవ్రత మరింత పెరిగి, రెండు కాలనీలతో పాటు గ్రామంపై కూడా ముంపు ప్రభావం ఉంటుందంటున్నారు.


ఏడీబీ రోడ్డు సీసీ డ్రైన్లను అనుసంధానించేందుకు హైవే దిగువన వేసిన సింగిల్ తూర దుస్థితి


భారీ వర్షాలకు ముంపునకు గురైన కొత్తకాలనీ (ఫైల్)

ఎవరి కోసమో ఆపేస్తారా?

ప్రభుత్వాలు ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర ప్రగతిని ఆలోచించి పథకాలు అమలు చేయాలి కానీ, ఏ ఒక్కరికో నష్టం వాటిల్లుతుందని పది మందికి ఉపయోగపడే పనులను ఆపించడం సరి కాదు. ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా రాజానగరంలో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ చేశారు. ఇప్పుడు అక్కడ రహదారి విస్తరణ మాత్రమే అంటూ, ఫ్లైఓవర్‌ని పక్కన పెట్టారంటున్నారు. స్థానికంగా ఉండే ఓ వ్యాపారవేత్త కోసం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ముడిపడి ఉన్న ఫ్లైఓవర్ ఏర్పాటును పక్కన పెట్టడం క్షమించరానిది.

– దూలం పెద్ద, మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ, రాజానగరం

కల్వర్టులు నిర్మించాలి

గ్రామంలో ఏడీబీ రోడ్డు ప్రారంభమయ్యే జంక్షన్‌లో ముంపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కల్వర్టులు నిర్మించాలి. ప్రస్తుతం తూతూమంత్రంగా తూరలు వేయడం వల్ల ఇప్పటికే ముంపు బెడదతో సతమవుతున్న కొత్త కాలనీ, సుబ్బారావు కాలనీలతో పాటు, గ్రామం కూడా ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులు లోతుగా ఆలోచించి, సరైన నిర్ణయం తీసుకోవాలి.

– మోది సత్తిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి, బీజేపీ, రాజానగరం

ఘనంగా బళ్లమ్మ బోనాల పండగ


పెదపూడిలో బోనాల పండగ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: గ్రామంలో ప్రసిద్ధి చెందిన బళ్లమ్మ అమ్మవారికి ఆదివారం బోనాలు పండగ ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి బోనాలను ఊరేగింపుగా బళ్లమ్మ అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు రామనాథకాశ్యపు శర్మ విశేషాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి ఆరుమిల్లి అమ్మన్నచౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీఎత్తున అన్న సమారాధన జరిగింది.

కూటమి పాలన మోసాలమయం

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సూపర్ సిక్స్ పథకాలు ఇచ్చేశానని చెప్పడం సిగ్గుచేటు
- హామీలిచ్చి.. ఎగ్గొట్టడం చంద్రబాబు నైజం
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో విధ్వంసం
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు

రంగంపేట: ఏడాది కాలంలో కూటమి పాలన మోసాలమయంతో, నయవంచన పాలనగా సాగిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని ఈలకొలను గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలే కాకుండా, అంతకు మించి సంక్షేమ పథకాలు ఇస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు నమ్మించారన్నారు. బాండ్లు ఇచ్చి, ప్రలోభ పెట్టి ప్రజలను పచ్చిమోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలను గాలికొదిలేశారన్నారు. చంద్రబాబు పాలనతో ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం ఎంత అనేది తెలియజేసి ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

మోసం చేసి సంబరాలా..

ఎన్నికల సమయంలో హామీలతో ప్రజలను నమ్మించి గెలుపొందిన కూటమి నేతలు అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. హామీలు అమలు చేయకుండానే, సుపరిపాలన అంటూ సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి, ప్రజలు మోసపోయిన విధానాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా వివరిద్దామని పిలుపునిచ్చారు.

ఏడాదిలోనే వ్యతిరేకత

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ప్రభుత్వ మోసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కోరారు. కూటమి పాలనలో జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరిద్దామన్నారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు అడబాల వెంకటేశ్వరరావు, మాచిన గోవిందరాజులు, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, మాజీ ఎంపీపీ పోతుల బులివీర్రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత అనంతపురం జట్టు



బహుమతులతో ఫుట్‌బాల్ పోటీల విజేత అనంతపురం జట్టు

రాజానగరం: చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో రెండు రోజులుగా జరిగిన ఏపీ సబ్ జూనియర్ బాలుర (అండర్–13) ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలో విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం, కృష్ణా జిల్లా జట్లకు ట్రోఫీలను అందజేశారు. ముగింపు సభకు ఐకాన్స్ ప్రెసిడెంట్ ఎం.వెంకన్నబాబు అధ్యక్షత వహించారు. చాప్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా మాట్లాడుతూ, ఈ పోటీలకు తొమ్మిది జిల్లాల నుంచి 275 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి, జీజీయూ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

సీతానగరం: రఘుదేవపురం శివారు కోడిపందాలు ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో దాడి చేసి, నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,500 నగదు, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజాస్వామ్యం పరిహాసం

- కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్‌పై దాడి అమానుషం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి



అనపర్తి: కూటమి పాలనలో ప్రజాస్వామ్యం పరిహాసానికి గురవుతోందని, సాక్షాత్తూ జిల్లా ప్రథమ పౌరురాలైన కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికపై గుడివాడలో టీడీపీ, జనసేన గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ అనపర్తి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నడూ లేని విష సంస్కృతిని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిందన్నారు. పరిణామాలు చూస్తుంటే కూటమి పార్టీల్లోని లుకలుకలను సర్దుబాటు చేసుకోలేక, పాలనను గాలికి వదిలేసిన ప్రభుత్వంలోని పెద్దలు.. ముకుమ్మడి దాడులు చేసి ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తూ కాలయాపన చేయడమే వారి లక్ష్యంగా కనిపిస్తుందని ఆరోపించారు. కేవలం ప్రతిపక్ష పార్టీకి చెందిన మహిళ కావడమే ఆమె చేసిన నేరమా అని ప్రశ్నించారు. అకారణంగా పోలీసుల సమక్షంలోనే కూటమి గూండాలు అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, మారణాయుధాలతో దాడికి తెగబడడం, ఆ అసాంఘిక శక్తులను పోలీసులు కూడా నిలువరించకపోవడం దారుణమన్నారు. గుడివాడ ఘటన అధికారం చెలాయిస్తున్న కూటమి ప్రభుత్వ అభద్రతా భావాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన కార్యక్రమానికి వెళుతున్న మహిళా ప్రజాప్రతినిధి, అందునా బీసీ నేతపై దాడి చేయడం, అధిక సంఖ్యలో నేతలను హౌస్ అరెస్టు చేసి నిర్బంధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి పాలనలో మహిళా సాధికారత మాట పక్కనపెడితే, స్వేచ్ఛగా బతకడానికి రక్షణ కరవైందని ధ్వజమెత్తారు.

జెడ్పీ చైర్మన్‌పై దాడి అమానుషం


పెదపాటి రమేష్‌బాబు

సీతానగరం: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్, బీసీ మహిళ ఉప్పాల హారికపై దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, దాసరి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్‌బాబు) ఖండించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ గూండాలు పోలీసుల సమక్షంలో రాళ్ల దాడి చేయడం.. ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతుందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో నడుస్తుందని, కేసులు పెట్టండి, లోపల వేయండి అనే చందాన పాలన నడుస్తుందని విమర్శించారు. ప్రశ్నించే వారి గొంతును కూటమి ప్రభుత్వం నొక్కుతోందన్నారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్షసాధింపు చర్యలపై పెట్టిన దృష్టి సూపర్ సిక్స్ పథకాల అమలుపై పెట్టాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతూ, పథకాలను సక్రమంగా అమలు చేయాలని హితవు పలికారు. జెడ్పీ చైర్మన్ హారికకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.


రాపాకలో మారమ్మ తల్లి


ఊరేగింపులో కోలాట నృత్యాలు

108 వంటకాలతో మారమ్మ తల్లికి సారె


వంటకాల సారెను ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: రాపాక గ్రామ దేవత మారమ్మ తల్లికి 108 వంటకాలతో సారె అందించారు. ఆదివారం రాపాకలోని అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాపాక, శ్రీరామనగరానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో నూతన చీరలు, 108 రకాల వంటలను బిందెల్లో ఉంచి, గరగ నృత్యాలు, కోలాటం, తీన్మార్ డప్పు వాయిద్యాలతో ఊరేగింపు జరిపారు. అమ్మవారి ఆలయానికి చేరుకుని, 108 రకాల వంటల సారెను అమ్మవారికి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పార్వతీదేవికి సారె సమర్పణ


బలభద్రపురంలో పార్వతీదేవికి సారె తీసుకువెళుతున్న మహిళలు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని పార్వతీదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించిన గ్రామస్థులు ఈ సారె తీసుకువచ్చారు. ముందుగా పార్వతీ పరమేశ్వరులను స్థానిక వేణుగోపాల స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయం మూడు వీధుల్లో ఊరేగించారు. గ్రామంలోని మహిళలు పసుపు, కుంకుమ, స్వీట్లతో గ్రామంలో ఊరేగించి, అనంతరం పార్వతీదేవికి సమర్పించారు.